సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం | 29 | సెప్టెంబర్ | 2024



డైట్‌లో బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

30న క్రికెట్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల సూపర్ టీ–20 స్టేడియంలో అండర్–14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బోనఫైడ్‌తో సోమవారం ఉదయం 10గంటలకు కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం పలుచోట్ల మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెజ్లింగ్‌తో మంచి భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పార్థసారథి

ఆదిలాబాద్: రెజ్లింగ్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జిల్లాస్థాయి అండర్–14,17 బాలబాలికల రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు ఉన్నారు.

'ఇన్‌స్పైర్' దరఖాస్తు గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల నామినేషన్ల దరఖాస్తు గడువు అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత తెలిపారు. జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుందని, ఇప్పటివరకు కేవలం 117 పాఠశాలల నుంచి కేవలం 440 మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 433 పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఒక్కో విద్యార్థి అకౌంట్‌లో రూ.10వేల చొప్పున జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను సైన్స్ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు.

అదనపు పీపీల బాధ్యతలు స్వీకరణ



జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)లుగా మేకల మధుకర్, సంజయ్ వైరాగ్రేలు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ప్రభాకర రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలంను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. మధుకర్ 2021 నుంచి 2024 ఏప్రిల్ వరకు అదనపు పీపీగా పనిచేసి వ్యక్తిగత కారణాలతో ఆ పోస్టుకు రాజీనామా చేశారు. ప్రస్తుతం జిల్లా మూడో అదనపు ఏపీపీగా విధుల్లో చేరారు. అలాగే సంజయ్ వైరాగ్రే ఆరేళ్లుగా అదనపు పీపీగా పనిచేస్తుండగా, ప్రస్తుతం జిల్లా మొదటి అదనపు కోర్టు ఏపీపీగా నియామకం అయ్యారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరి నియామకంపై పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. వరల్డ్ హార్ట్‌డే పురస్కరించుకొని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులతో ఏటా 18.6 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025లోగా ఈ మరణాలను 25శాతానికి తగ్గించడమే లక్ష్యంగా ప్రపంచఆరోగ్యసంస్థ ముందుకు సాగుతుందన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, జిల్లా కుష్టు నివారణఅధికారి గజానంద్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి అనిల్, ఎపడమాలజిస్ట్ అశోక్ పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడికి యత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఓ కాలనీలో 50 ఏళ్ల వ్యక్తి మూడేళ్ల బాలికపై శనివారం లైంగికదాడికి యత్నించాడు. బాలిక మధ్యాహ్నం ఇంట్లో ఆడుకుంటున్న క్రమంలో అదే కాలనీకి చెందిన చౌహాన్ నందకిశోర్ లోనికి ప్రవేశించాడు. తల్లి నిద్రిస్తుండగా చిన్నారిని బాత్‌రూంలోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలతో తల్లి నిద్ర లేవగా వెంటనే అతడు పరారయ్యాడు. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.



తుది జాబితాను పంచాయతీ నోటీసు బోర్డుపై ఉంచుతున్న గాదిగూడ మండలం రోమన్‌కాసా పంచాయతీ సిబ్బంది

పల్లె ఓటర్లు @ 4,41,795

- పంచాయతీ ఓటర్ల తుది జాబితా విడుదల
- పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికం
- కొత్తగా పెరిగిన ఓటర్లు 95 మంది

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు : 473

మొత్తం వార్డులు : 3, 870

మండలాల వారీగా పల్లె ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్‌రూరల్	14,355	15,045	0	29,400
బజార్‌హత్నూర్	11,531	11,908	0	23,439
బేల	15,588	15,595	0	31,183
భీంపూర్	9,181	9,935	0	19,116
బోథ్	18,074	19,452	1	37,527
గాదిగూడ	7,675	8,046	0	15,721
గుడిహత్నూర్	12,129	12,615	0	24,744
ఇచ్చోడ	16,749	17,653	1	34,403
ఇంద్రవెల్లి	15,139	15,465	2	30,606
జైనథ్	19,202	20,047	0	39,249
మావల	2,023	2,187	0	4,210
నార్నూర్	11,394	11,474	4	22,872
నేరడిగొండ	11,392	12,168	0	23,560
సిరికొండ	6,936	7,167	0	14,103
తలమడుగు	13,381	14,143	0	27,524
తాంసి	6,502	7,123	0	13,625
ఉట్నూర్	25,042	25,464	7	50,513

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీల్లోని ఓటర్ల లెక్క తేలింది. సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీల్లో వార్డుల వారీగా సిద్ధం చేసిన ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను జిల్లా పంచాయతీ శాఖ అధికారులు శనివారం ప్రకటించారు. జిల్లాలోని 17 మండలాల్లో గల 473 గ్రామ పంచాయతీల పరిధిలో 4,41,795 మంది ఓటర్లు ఉన్నట్లుగా వెల్లడించారు. ఇందులో పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికం. తుది జాబితాను ఆయా ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పంచాయతీల నోటీసుబోర్డులపై పొందుపరిచారు. ఈ నెల 13న ప్రకటించిన ముసాయిదా జాబితాతో పోల్చితే 95 మంది ఓటర్లు కొత్తగా పెరిగారు. ఓటర్ల లెక్క తేలడంతో ఆశావహులు వారిని మచ్చిక చేసుకునేందుకు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

అతివలే కీలకం..

పల్లె ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని మహిళా ఓటర్లే నిర్ణయించనున్నారు. తుది జాబితాను పరిశీలిస్తే పురుషుల కంటే మహిళా ఓటర్లు 9,194 మంది ఎక్కువగా ఉన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం పురుష ఓటర్లు 2,16,242 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,25,443 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు. తుది జాబితాలో పురుష ఓటర్లు 51 మంది, మహిళ ఓటర్లు 44 మంది అధికంగా పెరిగారు.

కొత్తగా 95 మంది ఓటర్లు పెరిగారు...

పల్లె ఓటర్లకు సంబంధించి ఈ నెల 13న ప్రతి గ్రామ పంచాయతీలో ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ అధికారులు ప్రకటించారు. దీనిపై ఈ నెల 14 నుంచి 21వరకు అభ్యంతరాలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 3,192 అభ్యంతరాలు అందాయి. వాటిని శుక్రవారం వరకు పరిశీలించి పరిష్కరించారు. తుది జాబితా సిద్ధం చేశారు. ఈ ప్రకారం బజార్‌హత్నూర్‌లో నలుగురు, నేరడిగొండ, గుడిహత్నూర్‌లో ఒకరు చొప్పున పురుష ఓటర్లు తగ్గారు. భీంపూర్ మండలంలో ఓ మహిళ ఓటరు తగ్గగా, బోథ్‌లో ఒకరు, గుడిహత్నూర్‌లో ఇద్దరు చొప్పున మహిళా ఓటర్లు పెరిగారు. ఇక అత్యధికంగా మావల మండలంలో ముసాయిదా జాబితాతో పోల్చితే 87 మంది అధికంగా పెరిగారు. ఇందులో పురుషులు 47 మంది, మహిళలు 40 మంది కొత్తగా నమోదయ్యారు. సిరికొండలో ముగ్గురు పురుష ఓటర్లు తగ్గగా, ఉట్నూర్‌లో ముగ్గురు పురుష ఓటర్లు, ఇద్దరు మహిళ ఓటర్లు కొత్తగా నమోదైనట్లు జిల్లాపంచాయతీ అధికారి ఎస్.శ్రీలత తెలిపారు. ఈ జాబితా ఆధారంగానే పంచాయతీ ఎన్నికలు జరగనున్నట్లుగా పేర్కొన్నారు. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ ప్రకటించిన ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. 2020–21 నుంచి 2023–24 వరకు మంజూరైన నిధులు, పురోగతిలో ఉన్న పనుల ప్రగతిపై మండలాల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సమీక్షించారు. జెడ్పీ, మండల పరిషత్ సెక్టార్‌లో, ఆరోగ్యశాఖలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులన్నింటినీ త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏమైనా పెండింగ్‌లో ఉంటే ప్రస్తుత ఆవశ్యకతను పునఃపరిశీలించాలని సూచించారు. ఇందులో జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, అదనపు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, పీఆర్ ఈఈ శివరాం రాథోడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

రాజీ మార్గమే ఉత్తమం

- జిల్లా జడ్జి ప్రభాకర రావు

ఆదిలాబాద్‌టౌన్: రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి ప్రభాకరరావు అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకున్న కక్షిదారులకు రాజీపత్రాలు అందజేశారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ, నేరం పర్యావసనం తెలిస్తే నేరాలు తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. ఇందుకోసం డీఎల్ఎస్ఏ ద్వారా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయంతో పాటు డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. క్రిమినల్, సివిల్, ఇన్సూరెన్స్, భార్యభర్తల తగాదాలు, సైబర్‌క్రైమ్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఇందులో ఎస్పీ గౌస్ ఆలం, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, జడ్జిలు ప్రమీళజైన్, మంజుల సూర్యవార్, దుర్గరాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

954 కేసులు పరిష్కారం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించినట్లు ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. రాజీమార్గం ద్వారా 954 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రూ.12లక్షల వరకు జరిమానాలు వసూలయ్యాయని పేర్కొన్నారు. వీటిలో 287ఎఫ్ఐఆర్ కేసులు, 665 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. 18 సైబర్ కేసుల్లో బాధితులకు రూ.3లక్షల 71వేల 175 తిరిగి అందించినట్లు పేర్కొన్నారు. ఐపీసీ కేసులు 287కు సంబంధించి రూ.6లక్షల 20వేల 550 జరిమానాలు, ఈపీటీ కేసులు 4800, డ్రంకెన్ డ్రైవ్ కేసులకు రూ.6లక్షల 67వేల 400 జరిమానా వసూలైనట్లు వివరించారు. 15రోజుల నుంచి పోలీసు అధికారులతో జిల్లా జడ్జి సమావేశాలు ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కోర్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను అభినందించారు.



కక్షిదారుడికి రాజీపత్రాన్ని అందజేస్తున్న జిల్లా జడ్జి

జీవో 25ను విరమించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.25ను విరమించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని తిర్పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడాన్ని నిరసిస్తూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అశాస్త్రీయమైన రేషనలైజేషన్ అమలు చేయాలని ఉత్తర్వులు విడుదల చేయడం సరికాదన్నారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ బాధ్యులు నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్, చంద్రశేఖర్, పొచ్చరెడ్డి, ఆర్.రవీందర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ సంఘ నాయకులు

కైలాస్‌నగర్: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 25ను తక్షణమే సవరించాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. సర్దుబాటు ఉత్తర్వుల రద్దు, బదిలీ, పదోన్నతుల్లో అన్యాయానికి గురైన ఉపాధ్యాయుల అప్పీళ్లు పరిష్కరించాలనే డిమాండ్‌తో శనివారం సాయంత్రం ఆ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఇందులో నాయకులు ఏ.వెంకట్, శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, కిష్టన్న, స్వామి పాల్గొన్నారు.

మహిళలను చూసే దృష్టిలో మార్పు రావాలి

- అట్టడుగువర్గాలకు కమిషన్ తెలిసేలా అవగాహన
- వేధింపుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ
- టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదిస్తే సత్వర న్యాయం
- మహిళా ఖైదీలకు కౌన్సెలింగ్
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద



మాట్లాడుతున్న శారద

కైలాస్‌నగర్: మహిళల సంక్షేమం, అభివృద్ధి, భద్రతే తొలి ప్రాధాన్యతగా ముందుకు సాగుతున్నాం.. వేధింపులకు గురైన, ఇబ్బందులు ఎదుర్కొంటున్న అట్టడుగు వర్గాల్లోని మహిళలు తమకు న్యాయం చేసేందుకు ఒక కమిషన్ ఉందనే విషయాన్ని తెలుసుకునేలా క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.. లైంగిక వేధింపులను కట్టడి చేయడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను సైతం మహిళలు అందుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం.. మహిళలను లక్ష్మి, పార్వతి, దుర్గామాతలా మాదిరి గౌరవించినప్పుడే వారిపై వేధింపులు తగ్గుతాయని, ఆ దిశగా పురుషుల్లో మార్పు రావాల్సిన అవసరముందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. కష్టాల్లో ఉన్న మహిళలు కమిషన్ టోల్ ఫ్రీనంబర్‌ను సంప్రదిస్తే వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడంతో పాటు అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. నాలుగు రోజుల పాటు జిల్లాలో పర్యటించిన ఆమె 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: నాలుగు రోజుల జిల్లా పర్యటన ఉద్దేశమేంటి..?

ఛైర్‌పర్సన్: మహిళల కోసం ప్రత్యేకంగా ఓ కమిషన్ పనిచేస్తుందనే విషయాన్ని వారికి తెలియజేయడంతో పాటు చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే జిల్లాలో పర్యటించాను. మహిళల సంక్షేమం, భద్రత, అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనే విషయాన్ని వారికి అవగాహన కల్పించాం. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వారికి ఏ మేరకు అందుతున్నాయనేదాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాను. ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించి ప్రభుత్వ ఫలాలు వారికి అందించాలని ఆదేశించాం.

సాక్షి: జిల్లా పర్యటనలో మీరు ఎలాంటి సమస్యలు గుర్తించారు.. వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

ఛైర్‌పర్సన్: జిల్లాలోని కేస్లాపూర్ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించాను. ప్రహరీ, భవనానికి సున్నం వేయించాలని, కంప్యూటర్ టీచర్ నియమించాలని విద్యార్థులు కోరారు. విషయాన్ని కలెక్టర్‌కు వివరించాను. వారం రోజుల్లోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉట్నూర్‌లోని మరో పాఠశాలను సందర్శించగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోగా, అనేక సమస్యలు కనిపించాయి. వాటిని వారం రోజుల్లోగా సరిదిద్దాలని అక్కడి వార్డెన్, హెచ్‌ఎంలను ఆదేశించాం.పరిస్థితిలో మార్పు రాకుంటే వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

సాక్షి: జిల్లా జైలును సందర్శించి మహిళా ఖైదీలతో భేటీ అయ్యారు కదా.. అక్కడ ఏమైనా సమస్యలను గుర్తించారా.. వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు.. ?

ఛైర్‌పర్సన్: నేరాలు చేసిన తర్వాత ఎదురయ్యే పర్యావసానాల గురించి సరైన అవగాహన లేకపోవడంతోనే మహిళలు నేరాలకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. కుటుంబాలకు దూరమైన వారు మానసికంగా తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నారు. అలాంటి వారికి సైకాలజిస్టుల ద్వారా వారంలో రెండు రోజులు కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. సీఎంతో చర్చించి ప్రత్యక్షంగా కానీ, వర్చువల్‌గా కానీ సైకాలజిస్టుల ద్వారా వారు మానసిక సంఘర్షణకు గురికాకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తాం.

సాక్షి: చిన్నారులు, మహిళలు, వృద్ధులపైన కూడా లైంగిక దాడులు ఇటీవల పెరిగాయి. వేధింపులను తట్టుకోలేక యువతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని ఏ విధంగా కట్టడి చేస్తారు..?

ఛైర్‌పర్సన్: చట్టాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు నేరాలకు పాల్పడితే జరిగే పరిణామాలను తెలియజేసేలా క్షేత్రస్థాయి నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఇలాంటి ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పురుషుల్లో మహిళలను గౌరవించేలా మార్పు వచ్చినప్పుడే నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చు. తమ తల్లి, చెల్లిని ఏ విధంగా ప్రేమించి, గౌరవిస్తారో ప్రతీ మహిళ, యువతీని అదే విధంగా గౌరవించాలనే బాధ్యత పురుషుల్లో రావాలి. లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీకి సూచించాం.

సాక్షి: ఏజెన్సీ ప్రాంతం కలిగిన ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ గిరిజన మహిళలు రక్తహీనతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన పౌష్టికాహారం అందకపోవడంతోనే ఈ పరిస్థితి అని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్యను ఎలా అధిగమిస్తారు..?

ఛైర్‌పర్సన్: రక్తహీనత సమస్య నా దృష్టికి రావడంతో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించాను. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలతో పాటు ప్రభుత్వ పథకాలు మహిళలకు ఏ విధంగా అందుతున్నాయనే దాన్ని తెలుసుకున్నాను. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం మరింత పారదర్శకంగా పకడ్బందీగా అమలు చేసేలా ఆదేశాలిచ్చాం.

సాక్షి: వేధింపులకు గురవుతున్న మహిళలకు కమిషన్ ద్వారా ఎలాంటి భరోసా ఇవ్వనున్నారు..

ఛైర్‌పర్సన్: కొత్తగా మారిన న్యాయ చట్టాలపై మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు సైతం తెలిసేలా అంగన్‌వాడీల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వారి రక్షణ, భద్రత, సంక్షేమం దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వేధింపులకు గురైన వారు తమ సమస్యను కమిషన్ దృష్టికి తీసుకొచ్చేలా జిల్లాలోని ప్రతీ పాఠశాల, వసతిగృహం, కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో 94905 55533 టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఈనంబర్‌కు ఫోన్‌చేసి సమస్యను వివరించిన వారికి కమిషన్ ద్వారా అన్ని విధాలా అండగా నిలుస్తాం.

బాధిత మహిళలకు అండగా నిలవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ఆదిలాబాద్‌టౌన్: బాధిత మహిళలకు అండగా నిలవాలని రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. నిర్వాహకురాలును పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే రకాల కేసులు వస్తున్నాయి.. ఎన్ని కేసులు నమోదు చేశారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయనే వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ ద్వారా ఐదు రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు సాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు ఈ కేంద్రంలో 225 కేసులు నమోదైనట్లు తెలిపారు. బాధితులు ఇబ్బందులకు గురైనప్పుడు డయల్ 100, 181నంబర్లపై సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి సబిత, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి,సుభద్ర, కవిత, ఏపీడీ మిల్కా, సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కౌన్సిలర్లు లావణ్య, సంఘమిత్ర, మంజుల, ప్రవీణ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ శారద

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌ను కలిసిన ఎస్పీ

కైలాస్‌నగర్: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శారదను ఎస్పీ గౌస్ ఆలం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ గెస్ట్‌హౌస్‌లో కలిసి పూలమొక్క అందజేశారు. జిల్లాలో నమోదైన కేసులు, మహిళల రక్షణ కోసం శాఖాపరంగా చేపట్టిన చర్యలకు సంబంధించిన పలు అంశాలపై ఇరువురు కాసేపు చర్చించారు.

అటవీశాఖ ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్‌టౌన్: ములుగు జిల్లా తాడ్వాయి రేంజ్‌లో ఇద్దరు అటవీశాఖ అధికారులపై దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జూనియర్ అటవీశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. అటవీ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు. రాత్రి,పగలు తేడా లేకుండా అటవీ సంరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అటవీశాఖ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని కోరారు. స్మగ్లర్ల చేతిలో ఉద్యోగులు, అధికారులు మృతిచెందుతున్న ఘటనలు చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇందులో అధికారులు నరేష్, కృష్ణ, సాయి, ప్రవీణ్, అమర్‌సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి మొక్కలు పట్టివేత



మొక్కలు స్వాధీనం చేసుకుంటున్న సీఐ

ఇచ్చోడ: మండలంలోని గుబ్బ గ్రామంలో పత్తి పంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పక్కా సమాచారంతో సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. సీఐ కథనం ప్రకారం..కోవ హనుమంత్‌కు చెందిన వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన పెందూర్ మానిక్యరావు కౌలు తీసుకుని సాగు చేస్తున్నాడు. పత్తిలో అంతర పంటగా గంజాయి సాగు చేస్తున్న 30 మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీటి విలువ రూ.45 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ దగ్ధం



దగ్ధమైన బైక్

భీమిని: కన్నెపల్లి మండలం నాయకునిపేట పంచాయతీ పరిధిలోని మొక్కంపల్లి (కుర్మగూడెం) గ్రామంలో శనివారం పల్సార్ బైక్ దగ్ధమైంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గాదర్ల మహేశ్ తన ఇంటి ముందు షెడ్డులో బైక్ పెట్టాడు. ఒగ్గు కథ చెప్పడానికి చెన్నూర్‌కు వెళ్లాడు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా బైక్ నుంచి భారీ శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. దీంతో మహేశ్ తల్లి ప్రేమల బయటికి వచ్చి చూడగా అదే గ్రామానికి చెందిన గాదర్ల రాజేశ్ పరిగెడుతూ కనిపించడం చూసింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

యువకుడి బైండోవర్

నెన్నెల: సోషల్ మీడియాలో సీఎం రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌పై అభ్యంతకర పోస్టుపెట్టిన ఓ వ్యక్తిని సోమవారం తహసీల్దార్ సబ్బ రమేశ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొత్తూర్‌కు చెందిన యువకుడు తలండి నాగేశ్ ఇటీవల సీఎం, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఫిర్యాదు మేరకు బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఎవరైనా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

లాఠీఎత్తారు..!

- మంచిర్యాల పోలీస్‌స్టేషన్ సాక్షిగా ఇరువర్గాల దాడి
- ఈనెల 23న ఘటన
- వరుస దాడులతో జనం బెంబేలు



గతేడాది సెప్టెంబర్‌లో బైపాస్‌రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద దాడులు చేస్తున్న ఓ వర్గం

మంచిర్యాలక్రైం: ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలుతో పోలీసులు పెద్దగా లాఠీలకు పని చెప్పినా దాఖలాలు లేవు. చాలాకాలం తర్వాత ఖాకీలు లాఠీలకు పనిచెప్పినా వీడియో వైరల్ అయింది. జిల్లాకేంద్రంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బైపాస్ రోడ్‌లో ఈనెల 23న అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు వద్ద పనిచేసే మేర సంజీవ్‌పై జరిగిన దాడి కేసులో పోలీసులు కొందరిని స్టేషన్‌కు పిలిపించినట్లు సమాచారం. కేసులో సంబంధం లేని వ్యక్తులను పిలవడంతో ఓ వర్గానికి చెందిన వారు అక్కడికి వెళ్లారు. మరో వర్గానికి చెందిన వారు అక్కడే ఉన్నారు. స్టేషన్ సాక్షిగా రెండువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. పోలీసులు వారిపై లాఠీ ఝుళిపించారని తెలిసింది.

వరుస దాడులు..

జిల్లాలో వరుసగా గ్యాంగ్‌లు, ఇరువర్గాలు పరస్పరం దాడులతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్టేషన్‌కు వచ్చిన యువకులపై లాఠీ ఝుళిపించడం, గొడవలు జరుగుతుంటే శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ కాస్త..మంచిర్యాల పోలీసుల తీరుతో 'పోకిరి'పోలీసింగ్ విధానంగా మారిందనే విమర్శలున్నాయి. 2022 జిల్లా కేంద్రంలో ఎల్‌ఐసీ కాలనీలో ప్రారంభమైన గ్యాంగ్ దాడి మొదలుకొని వరుస దాడులు ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ వరకు చేరుకోవడం, ఈ దాడుల్లో ఖాకీలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

- జిల్లాకేంద్రంలో ఇప్పటికే గ్యాంగ్ లీడర్ల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఓ వర్గానికి రాజకీయ, పోలీసుల బలం మెండుగా ఉన్నట్లు సమాచారం. రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరును అరికట్టడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. రాజకీయ బలం, ధన భలం ఉన్నవారికే పోలీస్ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.
- 2022, మే నెలలో ఎల్‌ఐసీ కాలనీలో ఓ భూవివాదంలో ఇంటి నిర్మాణం తొలగించడానికి ఓ ముఠా వీరంగం సృష్టించింది. 10 మంది మద్యం తాగి క్రికెట్ బ్యాట్లు, గడ్డపార పట్టుకుని హల్‌చల్ చేశారు. స్థానికులు 100 డయల్‌కు ఫోన్ చేయడంతోపోలీసులు వచ్చేసరికి పారిపోయారు.
- అదేనెలలో శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రెండు వర్గాల మధ్యం జరిగిన దాడిలో ఒకరు తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి నుంచి వరుసగా గ్యాంగ్‌లీడర్ల ఆరాచకాలు రోజురోజుకు పెట్రేగిపోతున్నాయి. ఏకంగా పోలీస్‌స్టేషన్ వరకు చేరుకుందంటే జిల్లాలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.
- గతేడాది సెప్టెంబర్‌లో జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనం రోజున మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య గొడవ పెద్దదిగా మారింది. బైపాస్ రోడ్‌లోని జగన్‌మోహన్‌రావు ఇంటిపై క్రికెట్ బ్యాట్లు, ఇనుప రాడ్లతో రెండు వర్గాలు దాడులు చేసుకుని బీభత్సం సృష్టించాయి.
- 2024 మే 14న ఐబీ చౌరస్తా సమీపంలో మా విందు హోటల్ ఎదుట రెండు వర్గాల దాడుల్లో ఇరువురికి గాయాలయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా పలువురిపై కేసులు నమోదైంది.
- గత జూన్ 2న బీఆర్ఎస్ యువ నాయకుడు గడప రాకేశ్‌పై ఓ వర్గానికి చెందిన గ్యాంగ్ దాడి చేసింది. దాడిచేసిన వారిపై కేసులు గుట్టుచప్పుడు కాకుండా కేసు నమోదు చేశారు.
- ఈనెల 23న బైపాస్ రోడ్‌లో కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు ఇంటి వద్ద మేర సంజీవ్‌పై బీఆర్ఎస్ యువనాయకుడు గడప రాకేశ్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఆత్మరక్షణ కోసం సంజీవ్ ఎదురు దాడి చేయగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.
- ఈనెల 25న పోలీస్‌స్టేషన్ ఆవరణలో రెండు వర్గాలు దాడి చేసుకున్నాయి. పోలీసుల లాఠీ ఛార్జ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిసే చర్యలు తీసుకుంటాం. రెండువర్గాల మధ్య దాడులు, ఉనికి చాటుకునేందుకు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. రాజకీయాలకతీతంగా కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్, పీడీయాక్టు నమోదు చేస్తాం. ఈనెల 25న పోలీస్‌స్టేషన్ లోపల రెండువర్గాలు దాడి చేసుకున్న విషయం నా దృష్టికి రాలేదు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

వివాహితపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కుభీర్: వివాహితపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. కుభీర్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మండలంలోని దోడర్నా గ్రామానికి జాదవ్ సాహెబ్రావ్ గత ఆరునెలలుగా లైంగిక వాంఛ తీర్చాలని ఓ వివాహితను వేధించాడు. ఈ విషయం తెలియడంతో ఆమె భర్త అతన్ని హెచ్చరించాడు. ఈనెల 26న వివాహిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో జాదవ్ సాహెబ్రావ్ ఆమెపై లైంగికదాడి చేసి ఆమె ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు రెండు బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రెండు ఫోన్లు, నిందితుడి బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్సై పి.రవీందర్, పోలీసులను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బ్రాంచ్ మెడల్ సాధించిన అనన్య

మంచిర్యాలటౌన్: సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ తెలంగాణ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌లో అండర్–17 విభాగంలో మంచిర్యాల బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అనన్య సెమీఫైనల్‌కు చేరి తృతీయస్థానంలో నిలిచినట్లు ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాంచ్ మెడల్‌ను సాధించిన అనన్య జాతీయస్థాయి జేబీసీ టోర్నమెంట్‌కు అర్హత సాధించగా, ఆమెతోపాటు కోచ్ నరేందర్‌ను అసోసియేషన్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, ట్రెజరర్ సత్యపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేశ్‌రెడ్డి, మధు అభినందించారు.

టీచర్ల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలి

మంచిర్యాలఅర్బన్: పాఠశాల విద్య–ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వులు సవరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) బాధ్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 25ను సవరించిన తర్వాత టీచర్లను సర్దుబాటు చేయాలన్నారు. బదిలీ అయి రిలీవ్ చేయని టీచర్లను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలలో సర్దుబాటు చేయాలన్నారు. బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలన్నారు. బోధనేతర పనులు, పాఠశాల పర్యవేక్షణ నిమిత్తం ప్రతీ ప్రాథమిక పాఠశాలలకు హెచ్ఎంలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాజావేణు, జయకృష్ణ, నాగలక్ష్మి, కిరణ్, కుమారస్వామి, కళావతి, గంగాధర్, అంజనేయులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి



పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని సంతోష్‌నగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పక్కా అందిన సమాచారంతో సీఐ రాజ్‌కుమార్, ఎస్సై ఉపేందర్ తమ సిబ్బందితో కలిసి కాలనీలోని అద్దె ఇంటిపై దాడి చేశారు. ఇందులో ఒక మహిళతోపాటు సీతారాంపల్లికి చెందిన బోలెం శ్రీకాంత్, నిర్వాహకుడు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం జక్కులపల్లికి చెందిన తోట మహేందర్‌ను అరెస్టు చేశారు. విచారణ నిమిత్తం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

ఆర్ఎంపీ రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట: వైద్యం వికటించి యువకుడి మృతికి కారణమైన దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన ఆర్ఎంపీని శనివారం రిమాండ్ తరలించినట్లు సీఐ నరేందర్, ఎస్సై సతీశ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. లక్సెట్టిపేట మండలం కొత్త కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ (26)కు జ్వరం వచ్చింది. గ్రామంలో ఆర్ఎంపీ బొడ్డు శ్రీనివాస్ అతనికి చికిత్స అందించాడు. మూడు ఇంజక్షన్లు రెండు గ్లూకోజ్‌లో కలిపి సెలైన్ ఎక్కించి వైద్యం చేయడంతో యువకుడికి చలిజ్వరం వచ్చింది. ఆర్ఎంపీ అతన్ని మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు పరిశీలించి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి రెఫర్ చేశారు. బ్రెయిన్ డెడ్ తర్వాత కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ ఈనెల 24న మృతిచెందాడు. ఆర్ఎంపీ ఇచ్చిన వైద్యం వికటించి తన కుమారుడు మృతిచెందాడని తండ్రి రాజలింగయ్య ఫిర్యాదుతో కేసు నమోదైనట్లు వారు తెలిపారు.

గేదెలను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి



ప్రవీణ్ (ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల రైల్వేబ్రిడ్జిపై గేదెలను బైక్ ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జైపూర్ సెకండ్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన సిర్రం ప్రవీణ్ (25), పొన్నం అజయ్ బైక్‌పై శుక్రవారం మంచిర్యాలలోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి రాత్రి ఇంటి వెళ్తుండగా గేదెలను వేగంగా ఢీకొట్టడంతో ప్రవీణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై తెలిపారు.

అరచేతిలో భగత్‌సింగ్ ముఖచిత్రం



తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన యువకుడు గట్టు రాజు తన అరచేతిపై వినూత్నంగా భగత్‌సింగ్ ముఖచిత్రాన్ని వేసుకుని అబ్బురపరిచాడు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానంతో అరచేతిలో భగత్‌సింగ్ ముఖ చిత్రాన్ని వేసుకుని ఇలా నివాళిర్పించాడు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వృద్ధుల చట్టాలను వివరిస్తున్న రిటైర్డ్ జడ్జి

మంచిర్యాలటౌన్: వృద్ధుల కోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రిటైర్డ్ జడ్జి కె.రాజన్న అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. రిటైర్డ్ జడ్జి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు వయోవృద్ధులను కుమారులు, కుమార్తెలు చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. రిటైర్డ్ డిప్యూటీ జీఎం రామస్వామి, రాజమల్లు, అడ్వొకేట్ లచ్చన్న, సందాన్, సురేందర్, రెస్పాన్స్ ఆఫీసర్ ఫర్జానా బేగం, డీహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సౌజన్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువుమృతి



మృతి చెందిన శిశువును తీసుకెళ్తున్న బంధువులు



రోదిస్తున్న బాధితురాలి బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి చెందింది. బాధితుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం రాజురా గ్రామానికి చెందిన కొట్టె ఆనందకు నెలలు నిండడంతో గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అదేరోజు వైద్యులు పరీక్షించి ప్రసవం చేశారు. దీంతో ఆడ శిశువు జన్మించగా, శనివారం మృతిచెందింది. రెండురోజులు ఆరోగ్యంగా ఉన్న శిశువు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందంటూ బంధువులు ఆరోపించారు. ఈ విషయమై కొద్దిసేపు ఆస్పత్రిలో ఆందోళన నెలకొనడంతో పోలీసులు చేరుకుని సముదాయించారు. అనంతరం మృతశిశువును బంధువులు స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఈ విషయమై వైద్యుడు అనిల్‌ను సంప్రదించగా, శిశువుకు పాలు తాపించే క్రమంలో తల్లి అజాగ్రత్త కారణంగా శిశువు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

జిల్లాలవారీగా వర్గీకరణ చేయాలి

- మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ జిల్లాలవారీగా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి విజ్ఞప్తి చేశారు. శనివారం మాదిగల మేలుకొలుపు యాత్ర పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి 10 జిల్లాల్లో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం వారి జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలన్నారు. కొన్ని జిల్లాల్లో మాదిగలు అధికంగా ఉన్నారన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో ఈ యాత్ర ఉంటుందన్నారు. జిల్లాలవారీగా వర్గీకరణ చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ యాత్ర చేపడుతామన్నారు. అక్టోబర్ 1న భువనగిరిలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు. మాదిగ జేఏసీ జిల్లా జిల్లా అధ్యక్షుడు మనోజ్, నాయకులు నక్క రాందాస్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కలగడ్డ సోమ చంద్రశేఖర్, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్, మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేశ్, గణేశ్ కథ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి ఉన్న రూ. 33 వేల కోట్లను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఆర్కే 6, ఆర్కే 7 గనులపై గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ.29 వేల కోట్ల బకాయి పెడితే తాజాగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో రూ. 4 వేల కోట్ల బకాయి పెంచిందన్నారు. ఈ బకాయి డబ్బులు సింగరేణి చెల్లిస్తే సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అంతేకాకుండా సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, ఇది పోవాలన్నారు. సింగరేణి సంస్థకు నష్టం జరిగేలా ప్రభుత్వం గానీ, యాజమాన్యం గానీ ఎలాంటి నిర్ణయం తీసుకున్న కార్మికులు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, కార్యదర్శి సారయ్య నాయకులు గొర్రె నరసయ్య, అఫ్రోజ్ ఖాన్, సంఘం సదానందం, బీర రవీందర్, చంద్రశేఖర్, చిలుక రామచందర్, రేగుల శంకర్, దొడ్డిపట్ల రవీందర్ పాల్గొన్నారు.

పవర్ ప్లాంటులో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోవాలి
- రూ.15 లక్షలు, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలిస్తామని అధికారుల హామీ



ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీధర్

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడిగా విధుల్లోకి తీసుకోవడం లేదని మనస్తాపంతో మాసు బాలకృష్ణ ఆత్మహత్యకు పాల్పడగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని హెచ్ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారంతోపాటు కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని కార్మికులు, నాయకులు ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. సంఘాల నాయకులు, బాధిత కుటుంబీకులతో పవర్‌మేక్ కంపెనీ అధికారులు, ఎస్సై శ్రీధర్ సమక్షంలో చర్చలు జరిపారు. పవర్‌మేక్ కంపెనీ నుంచి తక్షణ సాయం రూ.20వేలు అందించడంతోపాటు రూ.15 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకున్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమింపజేశారు.

3 నుంచి బాసరలో దసరా వేడుకలు



బాసర సరస్వతి అమ్మవారు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఈవో విజయరామారావు తెలిపారు. వేడుకల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అలంకరిస్తామన్నారు. మొదటిరోజు శైలపుత్రిగా, రెండో రోజు బ్రహ్మచారిణిగా, మూడవరోజు చంద్రఘంటా అలంకరణలో, నాలుగోరోజు కూష్మాండ అలంకరణ, ఐదోరోజు స్కదమాతగా, ఆరోరోజు కాత్యాయనిగా, ఏడో రోజు కాళరాత్రిగా, ఎనిమిదో రోజు మహాగౌరీగా, తొమ్మిదోజు సిద్ధిధాత్రిగా అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. నవరాత్రుల సందర్భంగా బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేడుకలకు రావాలని ఇప్పటికే మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆహ్వానం అందించినట్లు తెలిపారు.

ఐటీడీఏ ఉద్యాన నర్సరీ సందర్శన



నర్సరీని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని నిజామాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ (ట్రెయినీ) అజ్మీర సంకేత్ శనివారం సందర్శించారు. నర్సరీలో మొక్కల రక్షణకు తీసుకుంటున్న చర్యలను గురించి ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగు చేస్తున్న పసుపు, టమాట, వరి, జామ తోటలను పరిశీలించారు. హెచ్ఎం సుధీర్‌కుమార్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, నర్సరీ టెక్నికల్ అస్టింట్ అర్పిత ఉన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రామకృష్ణ ప్రతిభ

మందమర్రిరూరల్: సౌత్ అమెరికాలోని కొలంబియాలో ఈనెల 15 నుంచి 20 వరకు అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన రామకృష్ణ డబ్ల్యూపీఎస్ తరపున రెస్క్యూ టీమ్ ద్వారా వైస్ కెప్టెన్‌గా పాల్గొన్నాడు. 8 దేశాల నుంచి 21 జట్లు పాల్గొనగా, రామకృష్ణ జట్టు ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించింది. కేకే–5 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బొల్లపల్లి తిరుపతి–విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామకృష్ణ శనివారం మొదటి సారిగా ఇక్కడకు వచ్చాడు. తల్లిదండ్రులు అతన్ని ఓపెన్‌టాప్ వాహనంలో బ్యాండ్ మేళాల మధ్య ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.